
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 7 జూన్ 2024

ఆ ఖాకీల్లో.. కలవరం

- ఎస్ఐల నుంచి ఐపీఎస్‌ల వరకు బరితెగింపు
- వైసీపీ చట్టం అమలు చేయడంలో పలువురు పోటీ
- కోడ్ ముందు వరకు వారు ఆడిందే ఆట.. పాడిందే పాట
- టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాల్లో వారు
- నాడు ఇబ్బందులు ఎదుర్కొన్న పోలీసులకు సముచిత స్థానం దక్కేనా?

పోలీసులమనే విషయం మరిచారు. వైసీపీ నేతలకంటే ఎక్కువగా బరితెగించారు. రాజ్యాంగం.. ప్రజాస్వామ్యం.. కోర్టులను పట్టించుకోలేదు. ఐపీసీ కాదు.. వైసీపీ ముఖ్యమన్నట్లుగా చెలరేగారు. వైసీపీ నేతలు చెప్పడమే ఆలస్యమన్నట్లుగా కేసులు.. అరెస్టులతో చిత్రహింసలకు పాల్పడ్డారు. అన్యాయం జరిగింది అన్నా కూడా ప్రతిపక్షాలతో ముడిపెట్టి వారికి న్యాయం చేయలేదు. వైసీపీ శ్రేణులు చంపేస్తున్నాయి.. రక్షించండి అంటూ పోలీసు స్టేషన్లకు వెళ్లినా పట్టించుకోకపోగా ఊర్లు వదిలి వెళ్లింపోండనే సలహాలతో సరిపెట్టారు. మరికొందరు పోలీసులైతే వైసీపీ వారిపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ ఎదురు కేసులతో హింసించారు. ఐదేళ్ల ఖాకీరాజ్యంలో సామాన్యుల నుంచి ప్రతిపక్షా నేతల వరకు కనీసం మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా పోయింది. కొందరు ఎస్ఐలు, సీఐలే కాదు డీఎస్పీలు, ఐపీఎస్‌ల వరకు అధికార పార్టీ నేతలఆదేశాలకు అనుగుణంగా వైసీపీ చట్టం అమలు చేసేందుకు పోటీలు పడ్డారు. సామాన్యులు పోలీస్ స్టేషన్లకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని ధీమాతో బరితెగించిన పోలీసుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో కలవరం మొదలైంది.



గుంటూరు, జూన్ 6: ఐదేళ్ల ఖాకీరాజ్యానికి.. ఐపీసీకి బదులు అమలైన వైసీపీ చట్టానికి చెక్ పడింది. ఐదేళ్ల అరాచక పర్వానికి తెరపడింది. టీడీపీ, జనసేన కార్యకర్తలకే గాక సామాన్య ప్రజలకు కూడా స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభించాయి. వైసీపీ పాలనలో ఐదేళ్ల చట్టం, న్యాయంతో పని లేకుండా అధికార పార్టీ నేతలు ఏది చెప్తే అదే అమలు చేసిన పోలీసుల్లో కలవరం మొదలైంది. బాధితులపైనే తప్పుడు కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేసిన వారు ఇప్పుడు ఎలా తప్పించుకోవాలా అన్న మీమాంశలో పడిపోయారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అధికార పార్టీ నేతల ఆదేశాలతో కొందరు పోలీసులు వైసీపీ కార్యకర్తలు లాగా వేధింపులకు పాల్పడ్డారు. మరికొందరు అధికార పార్టీ నేతల మెప్పుకోసం అతిగా వ్యవహరించారు. అనేకమంది పోలీస్ అధికారులు మూడు సింహాలు సిగ్గుపడేలా ఐపీసీని వైసీపీగా మార్చి అరాచకాలకు పాల్పడ్డారు. ఈ జాబితాలో అనేకమంది ఎస్పీల నుంచి సీఐలు, ఎస్ఐలు, డీఎస్పీలు ఉన్నారు. అయితే వారంతా ఇప్పుడు టీడీపీ నాయకులు భావిస్తున్నట్లు భయపడటం లేదు. టీడీపీలో తమకు తెలిసిన నాయకుల ద్వారా ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. దారుణంగా అరాచకానికి పాల్పడి హిట్ లిస్టులో ఉన్న వారిలో మాత్రం కొంతవరకు కలవరం కనపడుతుంది. దీంతో వారు రాబోయే ప్రభుత్వం ఈ దఫా ఎలా వ్యవహరించబోతుందోననే ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. వైసీపీ హయాంలో కీలకమైన స్థానాల్లో ఉన్నవారు టీడీపీ, వైసీపీ వారి ఫోన్లు కూడా తీయకుండా, పలు సందర్భాల్లో కనీస గౌరవం కూడా ఇవ్వకుండా ఏకవచనంతో పిలుస్తూ దారుణంగా వ్యవహరించారు.

కార్యకర్తల్లో పెల్లుబికుతున్న ఆగ్రహం

గడిచిన ఐదేళ్లలో నెలకొన్న దారుణ పరిస్థితులను తలుచుకుని టీడీపీ, వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధిస్తూ కౌంటింగ్ సందర్భంగా ట్రెండ్ కొనసాగుతున్న సమయంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు అటు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, విడదల రజిని కార్యాలయాలపై దాడికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. ఈ సందర్భంగా కార్యకర్తలు వ్యవహరించిన తీరు గడిచిన 5 ఏళ్లలో వారు ఎదుర్కొన్న అణచివేత ప్రస్ఫుటంగా కనిపించింది. పోలీసులు లాఠీచార్జి చేస్తామన్న కార్యకర్తలు ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. ఐదేళ్ల ఈ లాఠీలు ఏమయ్యాయని, ఎక్కడ దాచి పెట్టారంటూ అధికారులను సైతం నిలదీశారు. గడచిన ఐదేళ్ల తమకు నరకం చూపించారని ఇప్పుడు కూడా తమను వేధిస్తామంటే సహించేది లేదంటూ ఎదురు తిరిగారు. తమను, సామాన్య ప్రజలను గడిచిన ఐదేళ్లలో వేధించిన ఏ పోలీస్ అధికారిని సహించేది లేదని వారికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వకపోవడమే కాక వారి వేధింపులపై సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రానున్న కొద్ది రోజుల్లో ప్రభుత్వ పాలనలో కీలకంగా మారిన పోలీస్ శాఖలో ప్రభుత్వ వైఖరి ఎలా ఉండబోతుందనే దానిపై అటు పోలీసు వర్గాల్లోను, ఇటు టీడీపీ, జనసేన కార్యకర్తల్లోనూ ఆసక్తి నెలకొంది.

పోలీసుల్లోనూ ఐదేళ్లుగా కొందరికి నరకం

గడిచిన ఐదేళ్ల అధికార పార్టీ నేతల వేధింపులు, పోస్టింగుల్లో వివక్షతో కొందరు పోలీసులు నరకం చూశారు. కొంతమంది స్వచ్ఛందంగా వలంటరీ రిటైర్మెంట్ ఇచ్చి వెళ్లే పరిస్థితికి తీసుకొచ్చారు. పలువురిపై తప్పుడు కేసులు బనాయించారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించే వారిని కూడా వదలకుండా పోస్టింగ్స్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచుతూ జీతం కూడా రానివ్వకుండా వేధింపులకు గురి చేశారు. చివరకు ఎన్నికలు విధులే కాకుండా సాధారణ బందోబస్తుల్లోనూ కీలక బాధ్యతలు అప్పగించకుండా ఎన్నో రకాలుగా వేధింపులకు గురిచేశారు. ఒకరిద్దరూ నిష్పక్షపాతంగా పనిచేసే వారు ఉన్నతాధికారుల మెప్పు పొంది జీతం కోసం లూప్‌లైన్ పోస్టింగ్ తెచ్చుకున్నప్పటికీ విషయం తెలుసుకుని వారిని అక్కడ కూడా ఉండనివ్వకుండా తరిమేశారు. ఈ పరిణామాలతో ఆ వర్గం పోలీసులు తీవ్ర మానసిక ఒత్తిడికి, ఆందోళనకు, ఆవేదనకు లోనయ్యారు. అలాగే వారితో పాటు టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్న వారిని కూడా పోస్టింగ్‌కు దూరంగా ఉంచారు. ఈ విధంగా తమ సర్వీసులో ఎన్నడూ చూడని విధంగా గడిచిన ఐదేళ్లలో వారికి నరకం చూపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో ఈసారైనా తమకు సముచిత స్థానం వస్తుందనే ఆశతో వారు ఎదురుచూస్తున్నారు.

ఖాకీరాజ్యంలో అరాచకం

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఖాకీరాజ్యం కొనసాగింది. పల్నాడులో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. టీడీపీలో చురుగ్గా తిరుగుతుంటే చాలు ఎస్ఐలు, సీఐలు వారిని స్టేషన్లకు పిలిపించి వైసీపీ కండువా అయినా కప్పుకోండి లేదంటే ఊరు వదిలిపెట్టి వెళ్లిపోండి అంటూ నేరుగా బెదిరింపులకు దిగారు. లేదంటే అక్రమ మద్యం, హత్యాయత్నం వంటి కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని, రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అంతేకాక వారి మాట వినని వారిపై హెచ్చరించినట్లుగానే తప్పుడు కేసులు బనాయించి స్టేషన్లో లాఠీ కౌన్సెలింగ్ ఇచ్చి వేధింపులకు గురి చేశారు. నెలలు తరబడి జైళ్లలో మగ్గిపోయేలా చేశారు. అంతేకాక అనేక గ్రామాల్లో టీడీపీలో చురుగ్గా పనిచేసే నాయకులు, కార్యకర్తల హత్యల వెనుక పోలీసుల ఉదాసీన వైఖరి కూడా స్పష్టంగా కనిపించింది. ఏ కారణం లేకుండానే పార్టీ నాయకులను, కార్యకర్తలను స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురి చేశారు. అనేక గ్రామాల్లో వైసీపీ గుండాల అరాచకాలకు టీడీపీ వర్గీయులు ఊళ్లు వదిలి పెట్టి వెళ్లిపోయారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఎక్కడా వారిని కట్టడి చేయకపోగా టీడీపీ వారిపైనే వేధింపులకు పాల్పడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపైనా, టీడీపీ కేంద్ర కార్యాలయంపైనా ఒక రోజు ముందే హెచ్చరించి యదేచ్ఛగా దాడులకు పాల్పడ్డారు. రాజధానిలో చంద్రబాబు బస్సు యాత్ర చేస్తుంటే పోలీసుల సహకారంతోనే ఆయనపై దాడికి యత్నించడం, రాళ్ళు కర్రలతో బస్సుపై దాడి చేయడం, మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్న, న్యాయవాది పారా కిశోర్‌లపై హత్యాయత్నం, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ నేతల మాదిరిగా బరితెగించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం వంటి దుర్మార్గ చర్యల్లో పోలీసులే కీలకంగా వ్యవహరించారు. పల్నాడులో వైసీపీ నాయకుల కంటే కూడా పోలీసులను చూస్తేనే టీడీపీ కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారంటే వారి పని తీరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

వైసీపీ కార్యాలయాల్లా పోలీస్‌స్టేషన్లు

ఐదేళ్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లు వైసీపీ కార్యాలయాల మారాయంటే ఆశ్చర్యం కాదు. అధికార పార్టీ బాధితులు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే అప్పటికే వారు అక్కడ ఉండటం.. వారే పోలీసులకు ఆదేశాలు జారీ చేయడం వాటిని ఆయా అధికారులు అమలు చేయడం సర్వసాధారణంగా మారింది. ఇక ప్రైవేటు పంచాయతీలు చేసే కేంద్రాలుగా పోలీసు స్టేషన్లను మార్చారనే అభియోగాలు వచ్చాయి. అధికార పార్టీ ల్యాండ్ మాఫియా చెప్పిందే ఖాకీలు తూచా తప్పకుండా పాటించారు. ఇదే అదునుగా పోలీస్ స్టేషన్లలో అవినీతి తాండవించింది. కేసు నమోదు చేయాలన్నా డబ్బులు, చేయకుండా ఉండాలన్నా డబ్బులు ఉండాల్సిందే. స్టేషన్ బెయిల్ ఇవ్వాలన్నా, కోర్టులో హాజరు పరచాలన్నా డబ్బులే. పోలీసు గడప తొక్కాలంటే జేబులో డబ్బులు కట్టలైనా ఉండాలి లేదంటే అధికార పార్టీ నేతల సిఫార్సు అయినా ఉండాలి. ఐదేళ్లు ఇలా ఖాకీ రాజ్యం సాగింది.

ప్రశ్నిస్తే కేసులు.. అరెస్టులు

అధికార పార్టీని కానీ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గాని ప్రశ్నించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా సీఐడీ అధికారులు రాత్రి, పగలు తేడా లేకుండా ఆడ, మగ చూడకుండా, వయసుతో సంబంధం లేకుండా అరెస్టులు, విచారణల పేరుతో వేధింపులకు గురి చేశారు. వెంగళరావు, దారపునేని నరేంద్ర లాంటి టీడీపీ కార్యకర్తల నుంచి రంగనాయకమ్మ అనే కామన్ మ్యాన్ వరకు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్బంధాలు.. వేధింపులకు గురయ్యారు. అధికార పార్టీ ఎంపీగా ఉన్న రఘురామకృష్ణంరాజు అరెస్టు నుంచి తప్పుడు కేసులలో టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, బండారు సత్యనారాయణమూర్తి, అయ్యన్నపాత్రుడు వంటి వారందరి విచారణకు గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయం వేదికగా నిలిచింది. రాజధానిలో దళిత రైతులపైనే ఎస్సీ ఎస్టీ కేసులు బనాయించి వారాల తరబడి జైళ్లలో నిర్బంధించారు. అనేక మంది వృద్ధులైన రాజధాని రైతులపై కూడా తప్పుడు కేసులు బనాయించి జైళ్లకు పంపారు. రాజధాని మహిళా రైతులపై అత్యంత కర్కశంగా లాఠీలతో విరుచుకుపడ్డారు.

సిఫార్సు బదిలీలకు చెక్

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇలాంటివి 70పైనే
- ఒక్కో బదిలీకి రూ.4 లక్షల వరకు ముడుపులు వసూలు
- పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు 40 మంది బదిలీ
- తాడేపల్లి ఎమార్సీలో చక్రం తిప్పిన ఓ ఉపాధ్యాయుడు
- అక్రమ బదిలీలపై ఆందోళనలను పట్టించుకోని అప్పటి ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం అధికారం.. అక్రమ బదిలీల రద్దుకు ఆదేశాలు

గుంటూరు(విద్య), జూన్ 6: ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీలను నిలిపివేస్తూ కొత్త ప్రభుత్వం బ్రేక్ వేసింది. దీంతో సిఫార్సులతో ముడుపులు ఇచ్చి బదిలీలు చేయించుకున్న ఉపాధ్యాయుల నోట్లో పచ్చివెలక్కాయ పడింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సిఫార్సు బదిలీలు దాదాపు 70పైగానే ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఇందులో అత్యధిక మంది పల్నాడు తదితర ప్రాంతాల నుంచి గుంటూరు జిల్లాలోని నాలుగు మున్సిపల్ కేంద్రాల్లోకి బదిలీలు తెచ్చుకున్నారు. ఇలా సిఫార్సు బదిలీ కోసం ఒక్కో ఉపాధ్యాయుడు రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 14 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేసింది. నాలుగేళ్లలో ఒకసారి ఏదో తూతూమంత్రంగా బదిలీలు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మరోవైపు యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చింది. దీంతో అనేక మంది స్వచ్ఛంద ఉద్యోగ విరమణతో బడికి దూరమయ్యారు. దీంతో అనేక ప్రాంతాల్లో ఉపాధ్యాయు ల కొరత తీవ్రస్థాయిలో ఏర్పడింది. అనేక పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల సమయంలో కూడా సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన వచ్చింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్‌లో విడతల వారీగా దాదాపు 70పైగా సిఫార్సు బదిలీలు జరిగాయి. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రస్థాయిలో ఆందోళన చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఈ బదిలీలకు తాత్కలికంగా బ్రేక్ పడింది. ఒక్కో బదిలీకి భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అక్రమ బదిలీలు, పరస్పర ఒప్పంద(మ్యూచువల్ బదిలీలు) తాడపల్లిలోని ఓ ఎమ్మార్సీ నుంచి ప్రారంభమయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ దాదాపు 15 ఏళ్లుగా ఉన్న ఓ ఉపాధ్యాయుడు ఇటువంటి అక్రమాలు చేయడంతో సిద్ధహస్తుడనే ఆరోపణ ఉంది. ఆయన నేరుగా విద్యాశాఖ పేషీలో చక్రం తిప్ప అక్రమ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇప్పించే వాడని ప్రచారం ఉంది. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈలోగా కొత్త ప్రభుత్వం కొలువు దీరనుంది. ఈ క్రమంలో సిఫార్సు బదిలీలు రద్దయ్యే పరిస్థితి నెలకొంది. ఈ చర్యపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



అమాత్యులు.. అయ్యేదెవరో?

- మంత్రి పదవుల రేసులో పలువురు సీనియర్లు
- జనసేన కోటాలో మనోహర్‌కి ఛాన్స్ దక్కే అవకాశం
- ఆశావహుల్లో ఆరోసారి గెలుపొందిన కన్నా, నరేంద్ర
- ఎస్సీ కోటాలో ఆ ముగ్గురిలో ఎవరి ప్రయత్నాలు ఫలించేనో



గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనట్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 17 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలుపొందారు. టీడీపీ సీనియర్లు అందరూ విజేతలుగా నిలిచారు. దీంతో కూటమి ప్రభుత్వంలో మంత్రి పదవులపై అందరూ ఆశపడుతున్నారు. రాజధాని ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ పర్యాయం చాలామంది మంత్రి పదవులు ఆశిస్తూ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు. 2014లో టీడీపీ గెలుపొందిన సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట) మంత్రి పదవిని చేపట్టి ఐదేళ్ల కొనసాగారు. అయితే ఎస్సీ కోటాలో తొలుత మంత్రి పదవి దక్కించుకున్న రావెల కిశోర్‌బాబు(ప్రత్తిపాడు) రెండున్నరేళ్లే ఉన్నారు. ఆ తర్వాత ఆయన్ను తప్పించగా నక్కా ఆనందబాబు(వేమూరు)ను అమాత్య పదవి వరించింది. రాబోయే ప్రభుత్వంలో ప్రత్తిపాటితో పాటు ఆనందబాబులు ఇద్దరూ రేసులో ఉన్నారు. ఇక పొన్నూరు నుంచి ఆరోసారి గెలిచిన ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబును ఓడించిన సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. ఆయనకు గతంలో వివిధ శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. అలాగే రేపల్లె నుంచి మూడో సారి విజయం సాధించిన అనగాని సత్యప్రసాద్ కూడా బీసీ కోటాలో మంత్రి పదవిని ఆశిస్తున్నారు. కాగా ఈ పర్యాయం తాడికొండ, ప్రత్తిపాడు ఎస్సీ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు కూడా మంత్రి పదవులను ఆశిస్తున్నారు. శ్రావణ్‌కుమార్ రాజధాని ప్రాంత ఎమ్మెల్యే కావడమే కాకుండా రెండో సారి గెలిచిన సీనియార్టీ కూడా తనకుందనే భావనలో ఉన్నారు. ఇక ప్రత్తిపాడు నుంచి గెలుపొందిన రామాంజనేయులు సీనియర్ ఐఏఎస్ అధికారిగా తనకున్న అనుభవం మూలంగా గెలిచింది మొదటి సారే అయినా తన పేరు కూడా పరిశీలనలో ఉంటుందనే భావనలో ఉన్నారు. ఇక గుంటూరులో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తొలిసారే అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నప్పటికీ వారు కూడా మంత్రి పదవులు ఆశిస్తున్నారు. మంత్రి విడదల రజినీని ఓడించి 51 వేలకు పైగా మెజార్టీతో ప్రతిష్ఠాత్మకమైన విజయం సాధించడం మూలంగా తన పేరు కూడా పరిశీలనలో ఉంటుందని గళ్లా మాధవి ఆశలో ఉన్నారు. తూర్పు నుంచి గెలిచిన ఎండీ నసీర్ అహ్మద్ రెండు దశాబ్దాల తర్వాత నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేసిన తన పేరును సామాజిక అంశం కోణంలో పరిశీలించే అవకాశం ఉందనే ఆశలో ఉన్నారు. ఇక పల్నాడు జిల్లాలో మంత్రి పదవుల రేసులో మరికొందరు సీనియర్లు ఉన్నారు. నిన్న మొన్నటి దాకా పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా పనిచేసి మూడో సారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్న వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కూడా అమాత్య పదవి తనను వరిస్తుందనే ఆశలో ఉన్నారు. అలాగే గురజాల నియోజకవర్గం నుం చి నాలుగోసారి విజయఢంకా మోగించిన యరపతినేని శ్రీనివాసరావు తాను తప్పనిసరిగా సీఎం చంద్రబాబు కేబినెట్‌లో ఉంటాననే ధీమాతో ఉన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరాచకాలకు అడ్డుకట్ట వేసి ప్రతిష్ఠాత్మకమైన విజయం సాధించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కూడా తాను గెలిచింది మొదటిసారే అయినా అక్కడి పరిస్థితుల దృష్ట్యా మంత్రి పదవిని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందనే భావనలో ఉన్నారు. పైగా పల్నాడు జిల్లాలో బ్రహ్మారెడ్డే అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు.

గుజ్జనగుండ్లలో రౌడీషీటర్ హత్య

- మద్యం ఇప్పించాలని బెదిరింపులే కారణమా?
- పథకం ప్రకారం పిలిచి కొట్టి చంపిన దుండగులు
- హతుడు గతంలో రెండు హత్య కేసుల్లో నిందితుడు

గుంటూరు, జూన్ 6: స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ షేక్ బాజీ అలియాస్ ఎర్రబాజీ(34) దారుణ హత్యకు గురయ్యాడు. సీఐ విజయ్‌చంద్ర కథనం మేరకు.. గుజ్జనగుండ్ల పరిధిలోని సాయికృష్ణనగర్‌కి చెందిన ఎర్రబాజీ గతంలో వంశీ, కార్తీక్, జాకీర్ తదితరులు కలసి తుఫాన్‌నగర్‌కు చెందిన బాజీ అనే యువకుడ్ని కొన్నేళ్ల క్రితం హతమార్చారు. ఆదినారాయణ అనే రౌడీషీటర్ హత్య కేసులోనూ ఎర్రబాజీ నిందితుడు. ఈ క్రమంలో ఎర్రబాజీపై రౌడీషీట్ తెరవడంతో కుటుంబంతో నాలుగేళ్లుగా క్రోసూరులో ఉంటున్నాడు. బాజీ సోదరుడు జానీబాషా విజ్ఞాన్ కళాశాల సమీపంలో ఉంటున్నాడు. నాయనమ్మ మృతితో బుధవారం నిర్వహించిన పెద్దకర్మకి సోదరులు హాజరయ్యారు. గుజ్జనగుండ్లలోని పోలేరమ్మ గుడి ప్రాంతానికి చెందిన షేక్ జాకీర్‌తో పాటు మరో ఐదుగురు స్నేహితులు బాజీ హత్యకు పథకం రూపొందించారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పార్టీ చేసుకుందామని జాకీర్ స్నేహితులు పిలవడంతో బాజీ, జానీబాషాలు వెళ్లారు. వీ కన్వెన్షన్ వెనుక వైపు ఖాళీ స్థలంలో బాజీ, జానీ బాషలతో పాటు జాకీర్, అతడి స్నేహితులైన నజీమ్‌బాష, షేక్ ఫయాజ్, షేక్ కరీముల్లా, వల్లంశెట్టి శరత్, గుంజ సుబ్రహ్మణ్యం అలియాస్ పార్థు తదితరులు బుధవారం రాత్రి మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న బాజీ తమ్ముడు జానీబాషాపై దాడితో పారిపోయాడు. అనంతరం కర్రలు, రాళ్లతో జాకీర్‌తో పాటు మిగిలిన ఐదుగురు కలసి బాజీపై దాడి చేశారు. వారి నుంచి తప్పించుకునేందుకు బాజీ పరిగెడుతూ పక్కనే ఉన్న అపార్ట్మెంట్ వద్దకు చేరుకున్నా వదలకుండా కొట్టి చంపేశారు. మద్యానికి బానిసైన బాజీ అప్పుడప్పుడు గుజ్జనగుండ్ల ప్రాంతానికి వచ్చి స్నేహితులను, స్థానికలను బెదిరిస్తుండేవాడని సమాచారం. ఈ క్రమంలో గతంలో జరిగిన బాజీ అనే యువకుడి హత్య కేసులో తనతో పాటుగా నిందితుడిగా ఉన్న తన స్నేహితుడైన షేక్ జాకీర్‌ను గడిచిన రెండు, మూడు నెలలుగా ఎర్రబాజీ మద్యం ఇప్పించాలంటూ బెదిరిస్తూ వచ్చాడు. దీంతో భయపడిన జాకీర్ తన స్నేహితుల సహాయంతో బుధవారం గుంటూరు వచ్చిన బాజీని పథకం ప్రకారం హత్య చేశాడు.

నృసింహునికి లోకేశ్, బ్రాహ్మణి ప్రత్యేక పూజలు



మంగళగిరి నృసింహాలయంలో ప్రదక్షిణ చేస్తున్న ఎమ్మెల్యే నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు

6లో..


గోరంట్ల దేవాలయంలో మొక్కులు తీర్చుకుంటున్న రాజధాని మహిళలతో శ్రావణ్‌కుమార్

మొక్కులు తీర్చుకున్న రాజధాని మహిళలు

● సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

గుంటూరు సిటీ, జూన్ 6: గుంటూరు నగరంలోని గోరంట్ల వేంకటేశ్వరునికి రాజధాని మహిళలు గురువారం మొక్కులు తీర్చుకున్నారు.మోతడక, నిడుముక్కల గ్రామాలకు చెందిన మహిళలు పాదయాత్ర చేస్తూ గోరంట్ల వేంకటేశ్వరుని గుడికి చేరుకున్నారు. ఎక్కువ సంఖ్యలో మహిళలు తరలిరావడంతో గుడి ప్రాంగణం కిక్కిరిసిపోయింది.ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. తాటికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని రైతుల పోరాటం మరువ లేనిదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మోతడక సర్పంచ్ యడ్లపల్లి పార్వతి, సాంబశివరావు, నిడుముక్కల టీడీపీ నేతలు చిగురుపాటి అణుపు, తలసల ప్రసన్నకుమార్, గోరంట్ల వెంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, ఆతుకూరి వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి బసవరాజు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 20 మందిపై కేసు

యడ్లపాడు, జూన్ 6: టీడీపీ వర్గీయులపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడిన ఘటనలో 20 మందిపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు. ఓట్ల లెక్కింపు తేదీ 4న పార్టీ విజయం సాధించడంతో టీడీపీ వర్గీయులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య స్వల్ప వివాదం ఏర్పడగా ఒకరినొకరు తోసుకున్నారు. ఇంతలో వైసీపీ వర్గీయులు రాళ్ళు విసరడంతో టీడీపీకి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. దీనితో దాడికి పాల్పడిన తుమ్మపూడి మరియబాబుతోపాటు మరో 17మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదే విషయమై మహిళల మధ్య మరోసారి గొడవ జరగడంతో నలుగురు మహిళలపై కూడా మరో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అయితే నలుగురు మహిళల్లో ఇద్దరు మొదటి కేసులో కూడా ముద్దాయిలుగా ఉన్నారన్నారు. దాడిలో ప్రమేయమున్న అందరినీ అరెస్ట్‌చేసి చిలకలూరిపేట కోర్టులో గురువారం హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు. తమపై కూడా దాడి జరిగిందంటూ వైసీపీ వర్గీయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12మంది టీడీపీ వర్గీయులపై కేసు నమోదుచేసినట్లు వెల్లడించారు.


విలేకరులతో మాట్లాడుతున్న అడిషనల్ ఏఎస్పీ హనుమంతురావు

గృహాల ధ్వంసం కేసులో 20 మంది అరెస్టు

● అడిషనల్ ఎస్పీ హనుమంతురావు

దుర్గి, జూన్ 6: మండలంలోని జంగమహేశ్వరపాడులో బుధవారం జరిగిన గృహాల ధ్వంసం కేసులో 20 మందిని అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ హనుమంతురావు తెలిపారు. గురువారం దుర్గి పోలీస్‌స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల అనంతరం వైసీపీ సానుభూతిపరులు దాడులకు భయపడి గ్రామాలు విడిచి 70 టీడీపీ కుటుంబాలు గ్రామం విడిచి వేరే కుటుంబాల్లో జీవిస్తున్నారు. కౌంటింగ్ అనంతరం టీడీపీ విజయోత్సవం అనంతరం గ్రామంలోని తమ గృహాలకు వచ్చారు. గృహాలు ధ్వంసం అవడాన్ని గుర్తించి ఆగ్రహంతో వైసీపీ సానుభూతిపరుల గృహాలను ధ్వంసం చేశారు. కారంపూడిలో పోలింగ్ మరుసటి రోజున హింసాత్మక ఘటనలో పాల్గొన్న వైసీపీ సానుభూతిపరులు గ్రామంలో లేకపోవడంతో వారి గృహాలను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. టీడీపీకి చెందిన 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పీ హనుమంతురావు తెలిపారు.

నృసింహునికి లోకేశ్, బ్రాహ్మణి ప్రత్యేక పూజలు

● ఎగువ, దిగువ సన్నిధి ఆలయాల్లో స్వామి వారి దర్శనం

మంగళగిరి, జూన్6: మంగళగిరి నియోజకవర్గం నుంచి అఖండ మెజార్టీతో విజయం సాధించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా గురువారం సాయంత్రం మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. సతీమణి బ్రాహ్మణితో కలిసి నారా లోకేశ్ శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత దిగువ సన్నిధిలోని తూర్పు రాజగోపురం వద్ద దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎ.రామకోటిరెడ్డి, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ముఖమండపంలో లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈవో రామకోటిరెడ్డి నృసింహుని చిత్రపటంతో కూడిన జ్ఞాపికను బహుకరించారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, నేతలు గుత్తికొండ ధనుంజయరావు, షేక్ రియాజ్, గాజుల శ్రీనివాసరావు, గోవాడ దుర్గారావు, సంకా బాలాజీగుప్తా, జొన్నాదుల బాలకృష్ణ, ఆకురాతి నాగేంద్రం, రంగిశెట్టి పెద్దబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.


... దిగువ సన్నిధిలో ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు

పల్నాడులో భూమాయ

● ఫైళ్లు చక్కబెడుతున్నారు!

● రెవెన్యూ కార్యాలయాల్లో 9 గంటల వరకు గుట్టుగా భూముల ఆన్‌లైన్

పిడుగురాళ్ల, జూన్ 6: ఎన్నికల విధులకు వచ్చాం.. ఎట్లావున్నా మరో పదిరోజుల్లో బదిలీపై మరో జిల్లాకు వెళ్లాల్సిందే.. ఈలోగా నాలుగు రాళ్లు వెనకేసుకునే పనిలో రెవెన్యూ అధికారులు తలమునకలవుతున్నారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పట్టాదారు పాస్‌పుస్తకాలకు, ఆన్‌లైన్‌లో భూముల వివరాలు నమోదుకు డిమాండ్ వుండటంతో కొందరు అధికారులు గుట్టుగా భూముల ఆన్‌లైన్ వ్యవహారాలను చక్కబెట్టేస్తున్నారు. గురజాల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు ఫిబ్రవరిలో కొత్త తహసీల్దార్లను నియమించడం జరిగింది. ఎన్నికల ప్రక్రియకు వచ్చిన తహసీల్దార్లు ఈఎన్నికల తంతు ముగిసింది. మరో కొద్ది రోజుల్లో మరో జిల్లాకు బదిలీపై వెళ్తున్నాం కదా అంటూ భూముల ఆన్‌లైన్ నమోదు ఫైళ్లను చక్కబెడుతున్నారు. ఎలాగైనా బదిలీ తప్పదనుకుంటున్న కొందరు వీఆర్‌ఓలు, రెవెన్యూ అధికారులు ఇదే మంచి సమయమంటూ అందిన కాడికి దండుకుంటూ గురువారం రాత్రి 9గంటల వరకు కూడా కార్యాలయాల్లో ఉండి తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు. అంతేకాకుండా పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మండలాల తహసీల్దార్ల పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ నేతల పేరుతో అడ్డగోలుగా ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. కొద్దిరోజుల్లో నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటిదాకా చేసిన అక్రమాల, అడ్డగోలు వ్యవహారాలు బయటకు రాకుండా కీలక సమాచారం, ఆన్‌లైన్‌లో భూముల వివరాలను తొలగించే పనిలో కొందరు రెవెన్యూ అధికారులు తలమునకలవుతున్నట్లు తెలుస్తుంది.

కౌంటింగ్ అల్లర్ల కేసుల్లో

85 మంది అరెస్టు

● విజయోత్సవాల్లో పాల్గొంటే కేసులు..

● ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరిక


ఎస్పీ మాలికాగార్గ్

నరసరావుపేట, జూన్ 6: జిల్లాలో కౌంటింగ్ సందర్భంగా ఫలితాలు విడుదలైన తర్వాత నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేశామని, ఈకేసుల్లో ఇప్పటి వరకు 85 మందిని అరెస్టు చేశామని పల్నాడుజిల్లా ఎస్పీ మలికాగార్గ్ తెలిపారు. గురువారం ఆమె విలేకులతో మాట్లాడుతూ. విజయోత్సవ ర్యాలీలకు దూరంగా ఉండాలని, వీటిల్లో పాల్గొన్నవారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నా కొంత మంది గుంపులుగా చేరి గ్రామాల్లో విచ్చలవిడిగా ప్రభుత్వాస్తులను ధ్వంసం చేసి, ప్రత్యర్థుల ఇళ్లపై దాడులు చేసిన అన్ని ఘటనలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు 38 కేసులు నమోదు చేసి, 274 మందిని ముద్దాయిలుగా గుర్తించి, 85 మందిని అరెస్టు చేయడం జరిగింది. కొంత మంది పరారీలో ఉన్నవారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. గురువారం ఒక్క రోజే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 72మందిని అరెస్టు చేశామని వీరిని రిమాండ్‌కి పంపిస్తామన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆస్తులైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లపై దాడులు చేసిన, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేసిన, వ్యక్తిగత దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి జైళ్లకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు.

కౌలు రైతు ఆత్మహత్య

వట్టిచెరుకూరు, జూన్6: అప్పుల భారంతో కౌలురైతు పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వింజనంపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గోరంట్ల కృష్ణారావు (70) తనకు ఉన్న సొంత భూమితో పాటు గత ఐదేళ్ల ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని ప్రత్తి, మిర్చి సాగు చేసుకుంటున్నారు. ఏటా అప్పుల తీరుతాయని కౌలు భూమి సాగు చేస్తున్నా మరింత అప్పులు పెరిగాయగాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయి కొంతకాలంగా మనోవేదనకు గురయ్యాడు. బుధవా రం ఇంటినుంచి వెళ్ళి మండలం పరిధి కొర్నెపాడు సమీపంలోని జగనన్నకాలనీలోని రోడ్డుపక్కన అపస్మారకస్థితిలో పడివున్నాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి జీజీహెచ్‌కి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

సీఎంవో ఆదేశాల కోసం ఎదురుచూపు

● సీఎం ప్రమాణ స్వీకార వేదిక ఖరారు కాగానే ఏర్పాట్లకు రెడీ

● తాడేపల్లి వెళ్లి ఉన్నతాధికారులను కలిసిన కలెక్టర్

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవ వేదికకి సంబంధించి ఏర్పాట్లు చేసేందుకు సీఎంవో ఆదేశాల కోసం జిల్లా యంత్రాంగం ఎదురు చూస్తున్నది. సీఎం కార్యాలయం నుంచి సమాచారం వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన సకల ఏర్పాట్లు చేసేందుకు అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. 2014లోనూ ఇదే రీతిన అప్పటి కలెక్టర్ సురేష్‌కుమార్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట భారీ ఏర్పాట్లు చేయించారు. ఈ దఫా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తారన్న సమాచారం ఉండటంతో అంతకంటే ఎక్కువగా ఏర్పాట్లు చేయడానికి సమాయత్తం అవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి తాడేపల్లి వెళ్లి సీఎంవోలో ఉన్నతాధికారులను కలిసినప్పటికీ ఇంకా వేదికపై స్పష్టత రాకపోవడంతో వెనక్కు వచ్చేశారు.


బలుసుపాడు వైసీపీ నేతల ఇంట్లో గొడ్డళ్ళు, కర్రలు

వైసీపీ నేత ఇంట్లో మారణాయుధాలు

● స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెదకూరపాడు, జూన్ 6 : పెదకూరపాడు ఎమ్మెల్యేగా భాష్యం ప్రవీణ్ గెలుపొందటంతో విజయోత్సవాన్ని జరుపుకున్న టీడీపీ వారిపై వైసీపీకి చెందిన వారు గొడవపడి ఇవే చివరి రోజులంటూ హెచ్చరించిన సంఘటన పల్నాడుజిల్లా పెదకూరపాడు మండలంలోని బలుసుపాడులో జరిగింది. బుధవారం రాత్రి గ్రామంలో టీడీపీ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. కాగా వైసీపీకి చెందిన వారు గురువారం ఉదయం గ్రామ మాజీ సర్పంచ్ నల్లమేకల సూరమ్మ కోటేశ్వరరావు ఇంటి పైకి వెళ్ళి గొడవ పడి మీకు ఇవే చివరి రోజులు. మిమ్మల్ని లేకుండా చేస్తామని హెచ్చరించారని టీడీపీకి చెందిన వారు తెలిపారు. ఈవిషయమై పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు ప్రతి ఇంటిని సోదా చేస్తుండగా వైసీపీకి చెందిన నల్లమేకల జగన్‌మోహనరావు, దర్శిశ్రీధర్‌ల ఇళ్లలో దాచివుంచిన ఆరు గొడ్డళ్ళు, కత్తి, 18 కర్రలను స్వాధీనం చేసుకున్నామని పెదకూరపాడు ఎస్ఐ వీ.వెంకటరావు తెలిపారు. ఈ విషయంపై వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు వివరించారు.

త్వరలో అన్ని శాఖల్లోకి కొత్త నీరు

● సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవంకాగానే బదిలీలు

● జిల్లా స్థాయి అధికారులకు తప్పనిసరిగా బదిలీలు

● ఎన్నికల కోసం ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు వెనక్కు

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గాడి తప్పిన ప్రభుత్వ శాఖలన్నింటిలోకి కొత్త నీరు రాబోతోన్నది. సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన కొద్ది రోజుల్లోనే బదిలీల ప్రక్రియ చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. తొలుత ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలు, ఆతర్వాత డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల్లో జిల్లా స్థాయి అధికారుల బదిలీలు చేపడతారు. ఈ నెల మూడు, నాలుగు వారంలలో బదిలీలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో విర్రవీగిన వారందరికి శంకరగిరి మాన్యాలు తప్పవన్న సంకేతాలు తెలుగుదేశం పార్టీ వర్గాల నుంచి వస్తోన్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో అధికారులు ఆ పార్టీకి అంట కాగారు. ఒక్క ఆ పార్టీ జెండాలు మాత్రమే బహిరంగంగా మోయలేదు తప్పా అన్ని చేసి పెట్టారు. వైసీపీ రంగులతో ప్రాంగణం, వేదికలని ముంచెత్తేవారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆ పార్టీ నాయకులు రాజకీయ ఆరోపణలు, విమర్శలు, ప్రసంగాలుచేస్తున్నా ముసిముసి నవ్వులు నవ్వుకొనేవారు. జిల్లా నీటియాజమాన్య సంస్థలో కీలక అధికారి ఒకరు వైసీపీ ప్రభుత్వంలో చలాయించుకొన్నారు. ఒక కీలక అధికారి అయితే పేదల ఇళ్లపట్టాల కోసం చేసిన భూసేకరణలో భారీగా దోచుకొన్నారు, వైసీపీ నేతలకు దోచిపెట్టారు. అలాంటి అధికారులంతా నేడు భిక్కుభిక్కు మంటున్నారు. తమపై ఎక్కడ విచారణలు మొదలౌతాయోనని మథనపడుతున్నారు. పేదల ఇళ్ల భూసేకరణ అనేది పెద్ద కుంభకోణం. దానిని విచారణ చేస్తే పెద్ద తలకాయలకే చుట్టుకుంటుంది. నివాసానికి పనికి రాని భూములను రూ. కోట్లు పెట్టి కొనుగోలుచేశారు. రకరకాల చట్టాలు తీసుకొచ్చి పెద్దలకు లబ్ధి చేకూర్చిపెట్టారు. అవన్నీ ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలుమెచ్చే సుపరిపాలన జరగాలంటే సమూలంగా ప్రక్షాళన తప్పదు.

టౌన్ హాల్లో డాక్టర్ కోడెల చిత్రపటం..

● రైల్వేబ్రిడ్జికి కోడెల పేరుతో బ్యానర్ ఏర్పాటు ..

నరసరావుపేటటౌన్,జూన్6: నరసరావుపేట పట్టణంలోని భువన చంద్రటౌన్ హాల్‌లో టీడీపీ శ్రేణులు, అభిమానులు గురువారం డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాన్ని ఏర్పాటుచేశారు. భువన చంద్రటౌన్ హాల్‌ను 2001లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రారంభించారు. ఆ తర్వాత ప్రభుత్వం మారటంతో భువన చంద్ర టౌన్ హాల్‌లో ఉన్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాన్ని వైసీపీ ప్రభుత్వం తొలగించింది. ఇటీవల ఎన్నికలలో టీడీపీ విజయదుందుభి మోగించడంతో టీడీపీ శ్రేణులు, అభిమానులు డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. ఆదేవిధంగా అండర్ రైల్వేబ్రిడ్జికి డాక్టర్ కోడెల పేరును వైసీపీ ప్రభుత్వం తొలగించడంతో ఇప్పుడు టీడీపీ శ్రేణుల మరళా ఏర్పాటు చేశారు.


రైల్వే అండర్ బ్రిడ్జికి డాక్టర్ కోడెల పేరును ఏర్పాటుచేస్తున్న టీడీపీ శ్రేణులు


భువనచంద్ర టౌన్ హాల్లో కోడెల చిత్రపటాన్ని ఏర్పాటు చేసిన అభిమానులు

ప్రజలపై నిందలు వేయటం తగదు

● జగన్ ఓటమిని హుందాగా అంగీకరించు..

● చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రత్తిపాటి పుల్లారావు


చంద్రబాబుతో ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 6 : ఇప్పటికైనా ప్రజలపై నిందలు వేయటం, సాకులు మాని వైసీపీ, జగన్‌రెడ్డి ఓటమిని హుందాగా అంగీకరిస్తే మేలని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హితవు పలికారు. ప్రజల విశ్వాసాన్ని కొనసాగించటమంటే మోసాల పునాదుల పై ఎదిగి అబద్దపు ప్రచారాలతో నెట్టుకొచ్చేంత సులువు కాదన్న విషయాన్ని ఇప్పటికైనా వారు తెలుసుకుంటే మేలన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటుతో పాటు కేంద్రంలో కీలక శక్తిగా తెలుగుదేశం పార్టీ అవతరించిన నేపథ్యంలో గురువారం పార్టీ అధినేత చంద్రబాబును మర్యాద పూర్వకంగా ఉండవల్లి నివాసంలో ప్రత్తిపాటి కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట నుంచి 33 వేలకుపైగా ఆధిక్యంతో గెలుపొందిన ప్రత్తిపాటిని చంద్రబాబు అభినందించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీని ఎంత విచ్ఛిన్నం చేయాలని చూసినా కార్యకర్తలు, నాయకుల్లో చంద్రబాబు నింపిన స్ఫూర్తే తమను ఈ స్థాయిలో తలెత్తుకొని నిల్చొనేలా చేసిందన్నారు. చంద్రబాబువంటి అలుపెరగని పోరాట యోధుడిని అవమానించి అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసిన రోజే వారి గొయ్యి వారే తవ్వుకున్నారని, ఇంకా వారి తప్పు వారు గ్రహించక పోతే భారీగా మూల్యం చెల్లించు కుంటారని పుల్లారావు అన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారం కోసం

రాష్ట్రం ఎదురుచూస్తోంది..

● వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, జూన్ 6: నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు ప్రమాణ స్వీకారం కోసం యావత్ రాష్ట్రం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. యావత్‌దేశం ఆశ్చర్యకరమైన ఫలితాలను అందుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో పాటు, యువనేత నారా లోకేష్‌ను ఆంజనేయులు దంపతులు మర్యాద పూర్వకంగా గురువారం ఉండవల్లిలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలోకలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ప్రజలు ఈడ్చికొట్టినా ఇప్పటికైనా వైసీపీ నాయకులు, వారి అధ్యక్షులు జగన్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోకుండా తిరిగి ప్రజలపై నిందలు వేయాలని చూడడం దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఐదేళ్లు జరిగిన దుర్మార్గాలన్నింటినీ ఆధారాలతో సహ బయటపెట్టి చట్టప్రకారమే వైసీపీ దొంగల ముఠా అందరిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దానికి సంబంధించి ఇప్పటికే నారాలోకేష్ రెడ్ బుక్‌లో సిద్ధంగా ఉన్నాయన్నారు. తప్పు చేయని వాళ్లను ఇబ్బంది పెట్టేది లేదని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈనెల 12 తేదీన చంద్రబాబు ప్రమాణ స్వీకారం కోసం ప్రజలందరితో పాటు, తాము తెలుగు దేశంపార్టీ నాయకులు, శ్రేణులంతా ఎదురు చూస్తున్నామని ఆయన తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరి మృతి

మాచర్లటౌన్, జూన్ 6: మాచర్ల మండలం తాళ్లపల్లి పవర్‌గ్రిడ్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొని ఇద్దరు మృతిచెందగా బాలుడికి గాయాలైన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం నాగార్జున సాగర్ సమీపంలోని నెల్లికల్లు తండాకు చెందిన చావిటి బాలు(30) మాచర్ల పట్టణంలోని సిమెంట్ వరలు తయారు చేసే కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా స్వగ్రామమైన నెల్లికల్లు తండాకు వెళ్లాడు. తిరిగి గురువారం ద్విచక్ర వాహనంపై భార్య, కుమారుడు ఈశ్వర్‌తో మాచర్లకు వస్తుండగా మాచర్ల మండలం తాళ్లపల్లి పవర్‌గ్రిడ్ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బాలుతో పాటు ఎదురు ద్విచక్ర వాహనంపై వస్తున్న మాచర్ల మండలం ఏడో మైలుకు చెందిన కొర్రా శ్రీనునాయక్ (50) మృతి చెందారు. కాగా బాలు కుమారుడు ఈశ్వర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాలను ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే పీఆర్కేపై మూడు కేసులు

రెంటచింతల, జూన్ 6: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై రెంటచింతల పోలీసుస్టేషన్‌లో మూడు కేసులు నమోదైనట్లు ఎస్ఐ ఆంజనేయులు చెప్పారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా పాలువాయిగేట్ గ్రామంలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం, టీడీపీ నేత నంబూరి శేషగిరిరావుపై హత్యాయత్నం,చెరుకూరి నాగశిరోమణిని దుర్భాషలాడిన ఘటనపై ఈ కేసులు నమోదైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవికి

నేడు లాలుపురం రాము రాజీనామా

గుంటూరు, జూన్ 6 (ఆంధ్యజ్యోతి) : జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తనపదవికి శుక్రవారం రాజీనామా చేయనున్నారు. వైసీపీ ప్రభుత్వం ఓటమి పాలై ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావటంతో వైసీపీకి చెందిన రాము ఈ నిర్ణయం తీసుకున్నారు. రూరల్‌మండలం లాల్‌పురం గ్రామానికి చెందిన రాము కాంగ్రెస్ హయాంలో గుంటూరు ఎంపీపీ, జడ్పీటీసీ పదవులను నిర్వహించారు. అప్పట్లో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైసీపీలో చేరారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటును ఆశించిన రాముకు అది దక్కకపోవటంతో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. తొలుత రెండేళ్లుగా ఆ పదవిలో ఆయన కొనసాగగా తిరిగి మళ్లీ ఆయనకే మరో రెండేళ్లపాటు చైర్మన్ పదవిని కట్టబెట్టారు. కాగా ఆయన హయాంలో బ్యాంక్ పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. పల్నాడు ప్రాంతంలో అనేక మందికి తప్పుడు రుణాలు ఇచ్చారని కూడా విమర్శలు వెల్లువెత్తాయి. ఇందులో వైసీపీకి అనుకూలంగా ఉండే బ్యాంక్ ఉద్యోగుల పాత్ర కూడా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఇప్పటివరకు వైసీపీ అధికారంలో ఉండటంతో ఆ ఆరోపణలను తొక్కిపట్టారు. అయితే అనూహ్యంగా భారీ మెజార్టీతో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావటంతో తన చైర్మన్‌పదవికి రాజీనామా చేసేందుకు రాము సిద్ధమయ్యారు. శుక్రవారం ఉద్యోగులకు, పాలకవర్గ సభ్యులకు విందు ఇచ్చి రాజీనామా చేసేందుకు రాము సన్నద్ధమయ్యారు.

వేద పాఠశాల ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జూన్6: స్థానిక మారుతినగర్‌లో శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఆర్షక ధర్మ సమితి' వేద స్మార్త సంస్కృత శాస్త్ర పాఠశాల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆలయ పాలక మండలి కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాలు పైబడి ఉపనయనం అయిన వారు, తెలుగు స్పష్టంగా చదవడం, వ్రాయడం వచ్చిన వారికి ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. వేద పాఠశాలలో ప్రవేశించిన వారికి ఉచిత భోజన, వసతి ఏర్పాటుతో పాటు విద్యార్థులను పరీక్షలకు పంపడం, సర్టిఫికెట్ ఇప్పించడం జరుగుతుందని వివరించారు. ప్రవేశాల గడువు ఈ నెల 20తేదీతో ముగుస్తుందని, ఇతర వివరాలకు 0863 2354285, 98488 72729 అనే నెంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

విద్యాశాఖలో అవకతవకలపై విచారణ చేయాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల డిమాండ్

గుంటూరు(విద్య), జూన్ 6: గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో విద్యాకానుక కిట్ల కొనుగోళ్ళు, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వ్యవహారాలపై న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. గురుకువారం జిల్లా కోర్టు రోడ్డులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు అధ్యక్షత వహించారు. చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను అనేక, అవమానాలకు, హేళనలకు గురిచేసిందన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తే అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. ఉద్యమాలు కాదు కాళ్ళు పట్టుకునే నేర్పరితనం ఉండాలంటూ చులకనగా మాట్లాడి చివరికి ఉద్యోగ, ఉపాధ్యాయులు మా దృష్టిలో ఓటర్లే కాదని లెక్కలేనితనంతో మాట్లాడరన్నారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాల విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా ఉన్న జీఓ 117ను రద్దు చేయాలన్నారు. 3, 4, 5 తరగతులు విలీన ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లాకమిటీ సభ్యులు పి.నాగశివన్నారాయణ, జనార్ధనరావు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణమూర్తి, దాస్, శ్రీను, బాలరాజు, మరియరాజు, శివరామకృష్ణ, కిషోర్‌షా, ఎన్.శ్రీనివాస్, వివిధ మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు..


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

నిస్వార్థ ప్రజాసేవకుడు ఎమ్మెల్యే యరపతినేని

● కొనియాడిన టీడీపీ నాయకుడు పాటిబండ్ల విష్ణువర్ధన్

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 6 : సమాజంలో పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ, నిరంతరం ప్రజాసేవకు అంకితమైన నిస్వార్థ ప్రజాసేవకుడు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అని గుంటూరు జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. గుంటూరులో యరపతినేని స్వగృహంలో గురువారం ఆయనను కలుసుకొని దుశ్శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు గురజాల నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూతలపాటి గోపీనాథ్, నగర కార్యనిర్వాహ కార్యదర్శి కొల్లి అనిల్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు మర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలు కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్, కొల్లి అనిల్, గోపీచంద్, నాగేశ్వరరావు

'వెరీ గుడ్, కనపర్తి.. బాగా కష్టపడ్డావు'

● చంద్రబాబు ప్రశంస



కనపర్తిని అభినందిస్తున్న అధినేత చంద్రబాబు

గుంటూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 'వెరీగుడ్ కనపర్తి.. బాగా కష్టపడ్డావు' అంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావును ప్రశంసించారు. ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబుని కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేయటానికి వెళ్లిన సందర్భంలో ఆయనకు ఊహించని అనుభవం ఎదురైంది. పార్టీ శ్రేణుల సమక్షంలో ఆయన అభినందించడం పట్ల కనపర్తి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ అయిదు సంవత్సరాలలో నాయకులు, కార్యకర్తలు పడ్డ కష్టాన్ని చంద్రబాబు స్పష్టంగా గమనించారని, ఈసారి పాలనతో పాటు కింది స్థాయి కార్యకర్తల మీద దృష్టి సారించటం జరుగుతుందన్నారు. ప్రజలతో పాటు కార్యకర్తలకు కూడా ఏ కష్టం వచ్చినా పార్టీ అన్ని విధాలా అండగా ఉండే విధంగా లోకేశ్ చర్యలు చేపట్టబోతున్నారని తెలిపారు. ఫలితాల అనంతరం టీడీపీ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తితంగా దాడులు జరుపుతున్నారని జగన్ మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను తీవ్రంగా దూషించిన కొడాలి నాని, అంబటి రాంబాబు, రోజారెడ్డి, వల్లభనేని వంశీ, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, అనిల్ ఎటు పారిపోయారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పాత్ర కూడా దక్కని మీరు ముందుగా చంద్రబాబుకి, పవన్ కళ్యాణ్‌కు క్షమాపణలు చెప్పి రాష్ట్రంలోకి అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు.



పొన్నూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ దుశ్శాలువాతో సత్కరించారు



గురజాల ఎమ్మెల్యేగా గెలుపొందిన యరపతినేని శ్రీనివాసరావును గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఈడే మురళీకృష్ణ



గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవిని దుశ్శాలువాతో సత్కరించి, ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ నేత తాళ్ల వెంకటేశ్ యాదవ్



ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌ని సన్మానిస్తున్న గుంటూరు జిల్లా బీసీ నేతలు వేములకొండ తదితరులు

పర్యావరణ సమతుల్యతను కాపాడుదాం

గుంటూరు(విద్య), జూన్ 6 : గుంటూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని స్థానిక గవర్నమెంట్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ షేక్ గౌసుల్ మీరా మాట్లాడుతూ భూమాత పచ్చగా, చల్లగా ఉంటేనే జీవరాశి మనుగడ సాధ్యం అవుతుందన్నారు. జిల్లా స్థాయిలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వం పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్దిఖ్, ఉపాధ్యాయులు అప్పారావు, నాగేశ్వరరావు, ధనయ్య, బాబురావు, కలామ్ తదితరులు పాల్గొన్నారు

● స్థానిక ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ 2,3 విభాగాల వారు ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల లో భాగంగా ఈరోజు జోసెఫ్ నగర్, వీవీపీ కాలనీలలో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. డి. ధాత్రికుమారి, కోఆర్డినేటర్ సుబ్బరత్నమ్మ, కె.ఆనంద్, పి. మేరీ, పాఠశాల సిబ్బంది మరియు జాతీయ సేవా పథకం విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కృషి మరువలేనిది

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ కృషి మరువలేనిదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. చంద్రబాబు నివాసం వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను కలిసి తన గెలుపులో కీలక పాత్ర పోషించిన ఎమ్మార్పీఎస్‌కు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ గతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన మాధవి, నేడు ప్రజా ప్రతినిధిగా సమర్ధవంతంగా నిర్వర్తిస్తారన్న నమ్మకం తనకు ఉందని, పేదల మనిషి మాధవి అని మందకృష్ణ మాదిగ అభినందించారు.

మాధవికి శుభాకాంక్షల వెల్లువ

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలిచిన గళ్లా మాధవికి అభినందనల వెల్లువ కొనసాగుతుంది. గురువారం కూడా పార్టీ శ్రేణులు, ప్రజలు, వివిధ వర్గాల నాయకులు, పలువురు అధికారులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరే విధంగా పరిపాలన అందిస్తానని గళ్లా మాధవి హామీనిచ్చారు. తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సుఖవాసి శ్రీనివాస్, సాలిమిటి మార్క్‌ల జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేపించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో...

● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేగా 51 వేల మెజార్టీతో విజయం సాధించిన గళ్లా మాధవిని ఆమె నివాసంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ, మన్నేపల్లి హనుమంతరావుశర్మ, పాటిబండ్ల విజయ్‌లు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యే మాధవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంద కృష్ణ మాదిగ



గళ్లా మాధవికి జ్ఞాపికను ఇస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర

ఎన్డీయే కూటమి విజయంపై నోబుల్ టీచర్స్ హర్షం

గుంటూరు(విద్య),జూన్ 6: ఎన్డీయే కూటమి విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి.హైమారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత అయిదు సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనకు, ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. జీవో నంబరు 117, 84 రద్దు, మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, సీపీఎస్ రద్దు వంటి అంశాలపై నూతన ప్రభుత్వం దృష్టిపెట్టాలని విజ్ఞప్తి చేశారు. నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరిగి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలి

గుంటూరు, జూన్ 6 : లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల అకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు-2 డివిజన్ ది సిటి ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ జానీబాషా గురువారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. గడిచిన అయిదేళ్ళుగా ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలు రాక నానా ఇబ్బందులు పడ్డారని, నూతన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారించాలని, ముఖ్యంగా సంస్కరణల ఫలితంగా వాణిజ్య పన్నుల ఉద్యోగులకు అనేక విధాల నష్టం జరిగిందని వాటిని సరిదిద్దాలని కోరారు. నూతన ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు తాము శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

రహదారి భద్రతపై ప్రత్యేక శిక్షణ తరగతులు

గుంటూరు(తూర్పు), జూన్ 6 : ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ కొరకు వచ్చే అభ్యర్థులకు రహదారి భద్రతపై ప్రత్యేక శిక్షణ తరగతులు జరుపుతున్నట్టు జిల్లా ఉప రవాణ కమిషనర్ షేక్ కరీం తెలిపారు. తరగతులలో ట్రాఫిక్ నిబంధనలు, రహదారి ప్రమాదాల చిత్రాలు ప్రత్యేక స్క్రీన్‌పై ప్రదర్శిస్తామన్నారు. ఎల్ ఎల్ ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే ప్రతి అభ్యర్థి రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో కనీసం 30 నిమిషాలు పాల్గొనాలని, లేని పక్షంలో ఎల్ ఎల్ ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయమని స్పష్టం చేశారు. ప్రతి రోజు 250 అభ్యర్థులకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విద్య పరమార్థాన్ని చాటి చెప్పే 'సూర్యోదయం'

● ఆచార్య తుర్లపాటి శంభయచారి

గుంటూరు(విద్య), జూన్ 6 : విద్య నేర్పడం ద్వారా అజ్ఞాన తిమిరాల నుంచి విజ్ఞాన లోకాలలో విహరించేందుకు తన టెలిఫిలిమ్స్ ద్వారా చాటి చెబుతున్నట్లు టెలిఫిలిమ్స్ కథా రచయిత, నిర్మాత, దర్శకుడు గన్నె నాగ వాసుదేవరావు, సంకీర్తనాచార్యుడు తుర్లపాటి శంభయాచారి పేర్కొన్నారు. స్థానిక ఏటీ అగ్రహారం రామిరెడ్డినగర్‌లోని తన నివాసంలో విద్య ప్రాధాన్యతను తెలియజెప్పే 'సూర్యోదయం' టెలి ఫిలిం నిర్మాణం గురు వారం ప్రారంభమైంది. విశ్వసంకీర్తన ఆచార్య తుర్లపాటి, శంభయాచారి, జి.వెంకటేశ్వరరావు తొలి ముహూర్తపు షాటును క్లాప్ కొట్టి ప్రారంభించా రు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత జీఎన్ వాసుదేవరావు మాట్లాడుతూ జడ్పీ డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా ఉంటూనే తన విద్యార్థుల చేత అనేక సామాజిక ప్రయోజిత కార్యక్రమాలు ధైర్యంగా పాటలు పాడటం, నటించడం నేర్పించానన్నారు. కార్యక్రమంలో నటీనటుల పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు(తూర్పు), జూన్ 6: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని గ్రంథాలయ శాఖను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి వారం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు. అనంతరం సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ విజ్ఞాన శిబిరాలకు వచ్చేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలన్నారు. గ్రంథాలయాధికారి బి.శకుంతల మాట్లాడుతూ బృందావన్‌గార్డెన్స్ గ్రంథాలయంలో 23 రోజులుగా జరుగుతున్న విజ్ఞాన శిబిరాల్లో 45 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నట్టు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పి.కోటేశ్వరి, సీహెచ్ లక్ష్మి, పి.సుధాకర్, ప్రభుత్వ ఉపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల యోధుడు చంద్ర రాజేశ్వరరావు

గుంటూరు(తూర్పు), జూన్ 6 : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసిన పోరాటాల యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కొనియాడారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్లో గురువారం చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం యావదాస్తిని పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు అని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, పచ్చల శివాజీ, ఆకిటి అరుణ్‌కుమార్, జి.సురేష్‌బాబు, మంగా శ్రీనివాసరావు, చల్లా మరియదాస్, నూతలపాటి చిన్న, దుపాటి రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జగన్‌ను ఛీకొట్టటంతోనే భారీ మెజార్టీ

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు, జూన్ 6(ఆంధ్ర జ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.. సైనికుల్లా పని చేయడం, జగ న్మోహన్‌రెడ్డి పాల నని ప్రజలు ఛీ కొట్టడంతో తమ పార్టీ భారీ మెజా ర్టీతో గెలిచింద ని తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. ఎమ్మెల్యేగా ఎన్ని కైన తరువాత తొలిసారిగా గురువా రం ఆయన విలేకరులతో మాట్లా డారు. భారతీయ జనతా పార్టీని బూచిగా చూపించినప్పటికీ ము స్లింలు కూటమికి పట్టం కట్టారని కొనియాడారు. గుంటూరు నగర పాలక సంస్థలో అర్ధరాత్రి అవినీతి ఫైళ్ళు కదులుతున్నాయని, ఎక్కడ తేడా జరిగినా అధికారులతో పాటూ గత పాలకులు ఇబ్బందులు పడాల్సి ఉంటుందని హెచ్చరించారు. పార్టీ నాయకులు పిల్లి మాణిక్య రావు చిట్టిబాబు, మద్దిరాల మ్యానీ సమావేశంలో పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నసీర్, టీడీపీ నేతలు



రావి వెంకట రమణను సన్మానిస్తున్న నసీర్

● గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు మొహమ్మద్ నసీర్ గురువారం ప్రత్తిపాడు మాజీ శాసనసభ్యుడు రావి వెంకటరమ ణను గుంటూరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన గెలుపు కోసం కృషి చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. రావి వెంకటరమణని దుశాలువాలతో పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడిగా ఎన్నికైన మొహమ్మద్ నసీర్‌కు గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ముస్లిం మత పెద్దలు గురువారం అభినందనలు తెలియజేశారు.

వృద్ధ కళాకారులకు సత్కారం

గుంటూరు(తూర్పు), జూన్ 6 : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సాంస్కృతిక బంధ సారిపల్లి కొండలరావు జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం యువకళావాహిని ఆధ్వర్యంలో వృద్ధ కళాకారులకు నగదు పురస్కార ప్రదాన సభ జరిగింది. సభకు సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. అతిథులుగా స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వేణుగోపాలరావు, కస్టమ్స్ అండ్ సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ గాదె శ్రీనివాసరెడ్డి, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, పట్టాభి కళాపీఠం అధ్యక్షుడు తూములూరి రాజేంద్రప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, విద్యావేత్త, కళాపోషకులు నూతలపాటి తిరుపతయ్య, సంస్థ ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొని రంగస్థల నటులు వరికూటి శివప్రసాద్, జానా రామయ్య, అమ్మని విజయలక్ష్మి, గాయకుడు స్టాలిన్‌బాబు, సంగీత విద్వాంసులు షేక్ సైదులు, రామ్మోహన్‌లను నగదు పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభానంతరం కావూరి సత్యనారాయణ రచనకు, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించిన అమరావతి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన అమృతహస్తం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో కావూరి సత్యనారాయణ, సరిత, హరిబాబు, మాధవి, గోపాల్‌రెడ్డి నటించారు.

శిక్షణ తరగతుల్ని సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు(విద్య), జూన్ 6 : స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని పరీక్ష భవన్లో 60 రోజుల ఎఫ్ఎం జ్ఞాన ప్రకాష్ శిక్షణలో భాగంగా రెండు రోజుల ఓరియంటేషన్ ప్రోగ్రాం ప్రారంభమైంది. కోర్సు కో ఆర్డినేటర్ డైట్ ప్రిన్సిపల్ సలీం బాషా ఆధ్వర్యంలో, సీనియర్ డైట్ ఫ్యాకల్టీ సుభాని, సాయి ప్రసాద్ పర్యవేక్షణలో మండల స్థాయిలో మెరుగైన ట్రైనింగ్ ఇచ్చే విధంగా పూర్తి సన్నద్ధతతో ఉండాలని, ఎటువంటి విభేదాలకు అస్కారం ఇవ్వవద్దని కోరారు. గుంటూరు డీఈవో పి.శైలజ శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్త పరిచారు. కార్యక్రమంలో సీనియర్ డైట్ ఫ్యాకల్టీ శ్రీనివాసరావు, ఉబేదుల్లా బేగ్, ఎంవీ కోటేశ్వరరావు, రవితేజ ట్రైనింగ్‌లో భాగస్వామ్యం అయిన వారందరికీ అసెస్‌మెంట్ కిట్లు పంపిణీ చేశారు.



కన్నాను సత్కరిస్తున్న కాపునాడు నాయకులు

ప్రజా ప్రతినిధులకు ఘన సత్కారం

గుంటూరు(తూర్పు), జూన్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుపొందిన టీడీపీ ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, గళ్లా మాధవి, నసీర్ అహ్మద్‌లను కాపునాడు గుంటూరు పార్లమెంటరీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపునాడు గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షులు మిరియాల గోపి, టీడీపీ సాంస్కృతిక విభాగపు జిల్లా అధ్యక్షుడు పప్పుల దేవదాసు, కాపు నాయకులు మిరియాల ప్రసాదు, డేగల వెంకటేశ్వరరావు, గంటా పెద్దబ్బాయి, చింతా వాసు, కొమ్మినేని శ్రీనివాసరావు, అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు నాయకుల అభినందనలు

గుంటూరు, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కన్నా లక్ష్మీనారాయణను పలువురు మాలమహానాడు నాయకులు గురువారం కన్నావారితోటలోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. మాలమహానాడు నాయకులు ఈమని చంద్రశేఖర్ కొర్రపాటి సురేష్ ఇతర నాయకులు కన్నాకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు గుంటూరు జిల్లా అధ్యక్షులు ఈమని చిట్టిబాబు, జిల్లా నేతలు చిన్నా, చంద్రశేఖర్, మల్లికార్జునరావు, శ్యామ్, దుర్గ, వెంకటేశ్వర్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మెకానిక్ మృతి

గుంటూరు, జూన్ 6 : టాటాఏస్ వాహనం ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న దండమూడి శ్రీనివాసరావు (44) మృతి చెందాడు. గుంటూరు రూరల్ మండలం చౌడవరం గ్రామానికి చెందిన దండమూడి శ్రీని వాసరావు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. 6న ఉదయం 9.30 గంటలకు తన బైక్ పై పని మీద వెళ్లి తిరిగి 11.00 గంటలకు ఆర్టీవో ఆఫీస్ నుంచి గుజ్జనగుండ్ల వైపు తన బైక్‌పై వస్తూ ఉండగా, ఓరియన్ హోటల్ సమీ పంలోకి రాగానే టాటాఏస్ వాహనం డ్రైవరు ఎదురుగా నిర్లక్ష్యంగా వచ్చి అతడిని ఢీకొనడంతో అతడు కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సదరు విషయం తెలుసుకున్న అయన భార్య దండమూడి అరుణకుమారి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంధ విద్యార్థిని ఆర్థిక సాయం

గుంటూరు(విద్య),జూన్ 6: అంధత్వ సమస్యతో బాధపడుతూ, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ చదువుల్లో మేటిగా రాణిస్తున్న హర్షాకు ఐఏఎస్ శిక్షణ కోసం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు రూ.20 వేల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. గణేశుని ఉషారాణి, వేజెండ్ల రాధాకృష్ణమూర్తి అందజేశారు. కార్యక్ర మంలో చైర్మన్ పావులూరి రమేష్, ప్రెసిడెంట్ పి.విమల కుమారి, కార్య దర్శి వర్రె సుబ్రహ్మణ్యం, వై.రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.







ఎమ్మెల్యేలుగా గెలుపొందిన నసీర్ (గుంటూరు తూర్పు), గళ్లా మాధవి (గుంటూరు పశ్చిమ), బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు)లను టీడీపీ తెలంగాణరాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి వేజెండ్ల కిశోర్‌బాబు సత్కరించారు. - గుంటూరు



ఆ విశ్వాసం పవన్ కళ్లలో కనిపించింది

పరుచూరి గోపాలకృష్ణ



ఆంధ్రప్రదేశ్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో అసాధారణ విజయం సొంతం చేసుకున్న కూటమికి చిత్ర పరిశ్రమ నుంచి శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. ఈ సందర్భంగా రచయిత పరుచూరి గోపాలకృష్ణ చంద్రబాబుకి, పవన్‌కల్యాణ్‌కు అభినంద నలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పవన్‌కల్యాణ్‌ను ప్రశంసిస్తూ 'పవన్‌కు బిడియం ఎక్కువ. కానీ ఈ ఎన్నికల కోసం ఎంతో ఆత్మవిశ్వాసంతో పని చేశారు. 'నేను సాధిస్తున్నా' అనే విశ్వాసం ఆయన కళ్లల్లో కనిపించింది. పవన్‌కల్యాణ్ అభిమానులు ఎంత ఎమోషనల్‌గా ఉంటారో నాకు తెలుసు. కూటమి ఏర్పాటులో పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషించి, ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన తర్వాత కూడా ఆయన ఎంతో విన యంగా ఎవరినీ నిందించకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలా అనే ఆలో చనతోనే మాట్లాడారు. అది పవన్ గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం' అన్నారు.

అందరినీ ఆకట్టుకుంటుంది



'గూఢచారి', 'మేజర్' చిత్రాలతో దర్శకుడిగా టాలీవుడ్‌లో తనదైన ముద్రవేశారు శశి కిరణ్‌తిక్క. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' సినిమాకు ఆయన స్ర్కీన్‌ప్లే అందించడమే కాకుండా సమర్పకులుగా వ్యవహరించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా శశి కిరణ్‌తిక్క మీడియాతో ముచ్చటించారు "ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. థియేటర్స్‌లో సినిమాను చూసేటప్పుడు ఇందులోని ఎమోషన్స్‌తో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారు. దర్శకుడు సుమన్ సినిమాను గ్రిప్పింగ్‌గా తీసిన విధానం, కాజల్ ఎనర్జిటిక్ యాక్టింగ్, శ్రీ చరణ్ సంగీతం ఈ సినిమాకు పెద్ద హైలైట్స్" అని చెప్పారు.

క్లీన్ చిట్ వచ్చే వరకూ..



బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్ట్ అయిన నటి హేమను మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) గురువారం సస్పెండ్ చేసింది. డ్రగ్స్ కేసుపై వివరణ ఇవ్వాలని హేమకు నోటీసు పంపించినా ఆమె స్పందించకపోవడంతో 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో హేమకు క్లీన్ చిట్ వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని 'మా' కార్యవర్గం తెలిపింది.

బ్లాక్‌బస్టర్ గ్యారంటీ



శర్వానంద్, కృతి శెట్టి హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించగా, టీ.జీ.విశ్వ ప్రసాద్ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ "ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ గ్యారంటీ" అని చెప్పారు. "కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ అన్నారు.











తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



గాంధీకి నివాళులర్పిస్తున్న మురళి

గాంధీ ఆశ్రమంలో కూటమి విజయోత్సవం

తెనాలి అర్బన్, జూన్ 6: మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో కూటమి విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. వల్లెం మురళి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమవాసులకు కేక్ కట్ చేసి పంపిణీ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా విజయం సాధించిన నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వజ్రాల రామలింగాచారి, రమణయ్య కోటేశ్వరరావు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కూటమి విజయోత్సవ కేక్‌ను కట్‌చేస్తున్న
టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ నాసర్ అహ్మద్, మొహిద్దీన్, భాష, తదితరులు

ముస్లింల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యం

● విజయోత్సవంలో టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు నాసర్ అహ్మద్

తెనాలి రూరల్, జూన్ 6: ముస్లిం మైనార్టీల అభ్యున్నతి టీడీపీ నారా చంద్రబాబునాయుడితోనే సాధ్యమని కూటమి విజయంతో మైనార్టీలకు మంచి జరగనుందని టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ నాసర్ అహ్మద్ అన్నారు. కూటమి ఘన విజయాన్ని సాధించిన సందర్భంగా ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో తెనాలిలో 50కేజీల భారీ కేక్‌ను కట్‌చేసి విజయోత్సవ సంబరాలు జరిపారు. కార్యక్రమంలో షఫీ, హనిషా, రవికుమార్, ముంత కృష్ణ, వెమలూరి సాయి, ముంత దుర్గ, నరేంద్ర, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న వీరవల్లి మురళి, నాగభూషణం మిత్రబృందం

వైసీపీ అరాచకాలను ఎదురొడ్డిన నాయకుడు ధూళిపాళ్ల

● గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

పొన్నూరు టౌన్, జూన్ 6: వైసీపీ అరాచకాలపై ఎదురొడ్డినిలిచిన నాయకుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకుడు వీరవల్లి మురళి అన్నారు. గురువారం పొన్నూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను వీరవల్లి మురళి, అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, సయ్యద్ నిజాం ఉద్దీన్, షేక్ సలాం పలువురు యూత్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను దుశాలువాతలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దగ్గుబాటి రామానాయుడుకు ఘన నివాళి



రామానాయుడు చిత్రపటం వద్ద
నివాళులర్పిస్తున్న దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, జూన్ 6 : వెండి తెరకు వెలుగులు నింపిన మహనీయుడు దివంగత దగ్గుబాటి రామానాయుడు అని ఏపీ మా వ్యవస్థాపకులు దిలీప్‌రాజా శ్లాఘించారు. సుల్తానాబాద్‌లోని కార్యాలయంలో గురువారం శత చిత్రాల నిర్మాత రామానాయుడు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 15 భాషల్లో 155 సినిమాలను నిర్మించారని, 24మంది కొత్త దర్శకులను, 12మంది హీరోయిన్లను పరిశ్రమకు పరిచయం చేశారని చెప్పారు. పద్మభూషణ్ అవార్డును అందుకోవడమే కాకుండా సినీ చిత్ర పరిశ్రమలో ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందారని చెప్పారు. వర్ధమాన నటీ టీనాచౌదరి, ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదర్ష్ స్కూల్‌లో చిత్రలేఖన శిబిరం

తెనాలి అర్బన్, జూన్ 6: గంగానమ్మపేటలోని ఆదర్ష్ స్కూల్‌లో వేసవి చిత్రలేఖన శిబిరం నిర్వహించారు. శిబిరంలో చిత్రాలు గీయడం నేర్చుకున్న బాల బాలికలు గురువారం పలు చిత్రాలను చిత్రించారు. ఆంధ్రా ప్యారిస్ ఆర్ట్స్ సొసైటీ నిర్వాహకులు జయశేఖర్ బొమ్మలు వేసే శిక్షణ ఇచ్చారు. సీనియర్స్ విభాగంలో కౌసిలి, శ్రద్ధ, జూనియర్స్ రుత్విక్, సబ్ జూనియర్స్‌లో సహస్ర బహుమతులు పొందారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

తెనాలి, మారీసుపేట జూన్ 6: పట్టణంలో రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని పోలీసులు తెలిపారు. త్రీటౌన్ ఎస్సై ఎస్.ప్రకాశరావు తెలిపిన వివరాల ప్రకారం గురువారం చెంచుపేటలో గుర్తు తెలియని మహిళ రోడ్డు దాటే సమయంలో ఎరువుల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. మృతిచెందిన మహిళ వివరాలు తెలియాల్సి ఉందని, ట్రాక్టర్‌ని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రకాశరావు తెలిపారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట జూన్ 6: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. గురువారం అన్నదాత సుఖీభవ సభ్యులు దాసరి కోటేశ్వరావు, రాధాకుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యుల సహకారంతో చల్లని మజ్జిగను, తాగునీరును పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, వీవీ ప్రతాప్, పోతరాజు, బాలునాయక్, శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ప్రత్యేక శిక్షణ తరగతులు

గుంటూరు (తూర్పు), జూన్ 6: ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే అభ్యర్థులకు రహదారి భద్రతపై ప్రత్యేక శిక్షణ తరగతులు జరుపుతున్నట్టు జిల్లా ఉప రవాణ కమిషనర్ షేక్ కరీం తెలిపారు. తరగతులలో ట్రాఫిక్ నిబంధనలు, రహదారి ప్రమాదాల చిత్రాలు ప్రత్యేక స్క్రీన్‌పై ప్రదర్శిస్తామన్నారు. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే ప్రతి అభ్యర్థి రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో కనీసం 30నిమిషాలు పాల్గొనాలని, లేని పక్షంలో ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయమని స్పష్టంచేశారు. ప్రతిరోజు 250మంది అభ్యర్థులకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలి

గుంటూరు, జూన్ 6: లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై వాణిజ్య పన్నుల శాఖ గుంటూరు-2 డివిజన్ ది సిటీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ జానీ బాషా గురువారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. గడిచిన అయిదేళ్ళుగా ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలు రాక నానా ఇబ్బందులు పడ్డారని, నూతన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారించాలని, ముఖ్యంగా సంస్కరణల ఫలితంగా వాణిజ్య పన్నుల ఉద్యోగులకు అనేక విధాల నష్టం జరిగిందన్నారు.

39కి 30 గ్రామాల్లో టీడీపీకి ఆధిక్యం

తెనాలి అర్బన్, జూన్ 6: తెనాలి పార్లమెంట్ సెగ్మెంట్‌లోని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకికి ఎనలేని ఆదరణ లభించింది. రూరల్ మండలం, కొల్లిపర మండలంలో 39 గ్రామాలు ఉంటే 30 గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి ఆధిక్యం లభించగా, 9 గ్రామాల్లో మాత్రమే వైసీపీకి మెజారిటీ దక్కింది. ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసీపీకి వచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రామం	టీడీపీ	వైసీపీ	మెజారిటీ
హాఫ్‌పేట	629	736	109
ఖాజీపేట	1532	81	1451
కొలకలూరు	5298	2615	2683
ఎరుకలపూడి	559	154	405
నందివెలుగు	3734	1218	2516
కంచర్లపాలెం	787	483	304
సోమసుందరపాలెం	1068	308	760
కఠెవరం	2933	1998	235
గుడివాడ	1241	883	358
కోపల్లె	636	587	49
సంగం జాగర్లమూడి	3126	1773	1355
అంగలకుదురు	3823	1303	2520
చావావారిపాలెం	368	429	61
మల్లెపాడు	625	717	92
తేలప్రోలు	1239	1210	129
నేలపాడు	427	304	123
పెదరావూరు	2623	2251	372
జగ్గడిగుంటపాలెం	2620	896	1746
బుర్రిపాలెం	1870	607	1263
చక్రాయపాలెం	1998	70	1928
జేముడుబాడు	577	344	233
దావులూరు	1219	687	532
శివలూరు	527	697	170
సిరిపురం	416	297	119
అత్తోట	2966	862	2104
కుంచవరం	459	245	214
దంతలూరు	391	399	8
అత్తలూరివారిపాలెం	190	64	126
వల్లభాపురం	1934	2327	393
మున్నంగి	2391	1953	438
పిడపర్రు	383	492	109
పిడపర్తిపాలెం	315	277	36
కొల్లిపర	3532	4647	1115
దావులూరిపాలెం	744	532	212
తుములూరు	1836	1691	145
హనుమాన్‌పాలెం	519	135	384
బొమ్మువానిపాలెం	278	307	29
అన్నవరం	633	531	102
అన్నవరపులంక	382	369	13

మనోహర్‌కు పలువురు ప్రముఖుల అభినందనలు



మనోహర్‌తో విద్యుత్ ఎస్ఈ మురళీకృష్ణ యాదవ్, ఇతర అధికారులు

తెనాలి రూరల్, జూన్ 6: తెనాలి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన నాదెండ్ల మనోహర్‌ను పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఏపీఎస్‌సీడీసీఎల్ ఎస్ఈ మురళీకృష్ణయాదవ్, పలువురు ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు గుమ్మడి రమేష్, పాటిబండ్ల గోపి, కొడాలి సుబ్రహ్మణ్యం, సుధీర్, గౌతమ్, బాలకృష్ణ, జెమిని, తదితరులు కలిసి దుశాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. పద్మావతి డెకొరేషన్స్ లైటింగ్స్ అధినేత పిల్లి వీరయ్య, వెట్టి గుణ, పి.కిరణ్, మనోజ్, సైల్వ రాజు, రవితేజ, కృష్ణ, ఆనంద్, విజయ్‌కుమార్, భాగ్యరాజు, సాయి తదితరులు మనోహర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజవర్గంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో జనసేన మనోహర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. వారందరికీ మనోహర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

● తెనాలి, మారీసుపేట జూన్ 6: తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన నాదెండ్ల మనోహర్‌ను టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ కలసి అభినందనలు తెలిపారు. స్థానిక బోసురోడ్డులోని జనసేనపార్టీ కార్యాలయంలో గురువారం నాదెండ్ల మనోహర్‌ను టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, ఉపేంద్రలు కలసి పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాకుమాను ఉపేంద్ర, గుమ్మడి ప్రసాద్, జేడి శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.



మనోహర్‌కు అభినందనలు తెలుపుతున్న వెంకట పూర్ణచంద్, శ్రీనివాసరావు,ఉపేంద్ర, గుమ్మడి రమేష్, వారి మిత్ర బృందం

ఆహార నియమాలపై శ్రద్ధవహించాలి: డాక్టర్ హనీఫ్



అంగలకుదురులో వైద్యపరీక్షలు
చేస్తున్న డాక్టర్ హనీఫ్

తెనాలి రూరల్, జూన్ 6: షుగర్ ఉన్న వారు తప్పనిసరిగా ఆహార నియమాలపై శ్రద్ధ వహించాలని సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హనీఫ్ అన్నారు. గురువారం మండలంలోని అంగలకుదురు సచివాలయంలో ఆరోగ్య క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు అనారోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. షుగర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం, ఆహారంలో ఉప్పు శాతం తగ్గించుకుంటూ తాజా కూరలతో మితంగా ఆహారం తీసుకోవడం వంటి వాటితో పాటు ప్రశాంతంగా ఉండటం అలవరచుకోవడం ద్వారా వ్యాధి అదుపులో ఉంటుందన్నారు. డాక్టర్లు సూచించిన మేరకు మందులు వాడుతూ ఏదైనా అనారోగ్యసమస్య ఉత్పన్నమైతే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. చక్కని జీవనశైలిని అలవరచుకుంటే ఈ వ్యాధిని అధిగమించవచ్చని హనీఫ్ చెప్పారు. పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

46 శాతం మంది ఎంపీలు నేరచరితులు

● ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల, జూన్ 6: లోక్‌సభకు నూతనంగా ఎన్నికైన ఎంపీలలో 46 శాతం మంది నేరచరితులుగా ఉన్నట్లు ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ 31శాతం మంది తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారన్నారు. ఎంపీల నేరచరిత్ర 2009వ సంవత్సరం నుంచి క్రమేపి పెరుగుతూ వస్తున్నదన్నారు. 2009లో 30శాతం మంది ఉంటే 2019లో 43 శాతానికి పెరిగి ప్రస్తుతం 46శాతానికి పెరగటం విశేషమన్నారు. నూతన ఎంపీలలో 93శాతం కోటేశ్వరులు వీరి సగటు ఆస్తి విలువ 46.34 కోట్ల రూపాయలుగా ఉందన్నారు. 2009లో 58శాతం మంది కోటేశ్వరులు ఉండగా 2014లో 82 శాతానికి, 2019లో 88శాతానికి పెరగగా ఈ ఏడాది 93శాతానికి పెరిగిందన్నారు.

బగళాముఖిని దర్శించుకున్న దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్

పిట్టలవానిపాలెం, జూన్ 6: మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న బగళాముఖి అమ్మవారి ఆలయానికి దేవదాయ శాఖ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారికి పూర్ణకుంభంతో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఘనస్వాగతం పలికి వేద ఆశీర్వచనం నిర్వహించారు. అమ్మవారి జ్ఞాపికను అందజేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. శ్రీనివాసరావు ఆలయాన్ని నిశితంగా పరిశీలించి శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి తూర్పు రాజగోపురం, ఉత్తరం అర్చి, విమానగోపురం వంటి పనులు పురాతన ఆలయాల్లో ఉండేవిధంగా తీర్చిదిద్దుతామని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తికి తెలిపారు. అమ్మవారి హోమ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ టి.మురళీకృష్ణ, కాకినాడ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

వృద్ధ కళాకారులకు సత్కారం

గుంటూరు (తూర్పు), జూన్ 6: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సాంస్కృతిక బంధ సారిపల్లి కొండలరావు జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం యువకళావాహిని ఆధ్వర్యంలో వృద్ధ కళాకారులకు నగదు పురస్కార ప్రధాన సభ జరిగింది. సభకు సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. అతిథులుగా స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వేణుగోపాలరావు, కస్టమ్స్ అండ్ సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ గాదె శ్రీనివాసరెడ్డి, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, పట్టాభి కళాపీఠం అధ్యక్షుడు తూములూరి రాజేంద్రప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, విద్యావేత్త, కళాపోషకులు నూతలపాటి తిరుపతయ్య, సంస్థ ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొని రంగస్థల నటులు వరికూటి శివప్రసాద్, జానా రామయ్య అమ్మని విజయలక్ష్మి, గాయకుడు స్టాలిన్‌బాబు, సంగీత విద్వాంసులు షేక్ సైదులు, రామ్మోహన్‌లను నగదు పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభానంతరం కావూరి సత్యనారాయణ రచనకు, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించిన అమరావతి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన అమృతహస్తం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.



రేణుకాదేవి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా రేణుకాదేవి అమ్మవారి ఉత్సవాలు

కొల్లిపర, జూన్ 6: మండల పరిధిలోని తూములూరులోని శ్రీరేణుకాదేవి అమ్మవారి 32వ వార్షికోత్సవ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. పండితులు శివానందం, రాంబాబు గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు అభివృద్ధి చెందాలని కోరుతూ ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచన, విష్వక్సేన వంటి పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రేణుకాదేవి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు అధికసంఖ్యలో తరలి పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణా జిల్లా వుయ్యూరుకు చెందిన అవుతు రామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు భజనలు చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరేణుకాదేవి అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విద్య పరమార్థాన్ని చాటి చెప్పే 'సూర్యోదయం'

● ఆచార్య తుర్లపాటి శంభయచారి




లఘుచిత్రంను ప్రారంభిస్తున్న తుర్లపాటి శంభయచారి, గన్నె నాగవాసుదేవరావు తదితరులు

గుంటూరు (విద్య), జూన్ 6: విద్య నేర్పడం ద్వారా అజ్ఞాన తిమిరాల నుంచి విజ్ఞాన లోకాలలో విహరించేందుకు తన టెలీఫిలిమ్స్ ద్వారా చాటి చెబుతున్నట్లు టెలీఫిలిమ్స్ కథా రచయిత, నిర్మాత, దర్శకుడు గన్నె నాగ వాసుదేవరావు, సంకీర్తనాచార్యుడు తుర్లపాటి శంభయాచారి పేర్కొన్నారు. స్థానిక ఏటీ అగ్రహారం రామిరెడ్డినగర్‌లోని తన నివాసంలో విద్య ప్రాధాన్యతను తెలియజెప్పే 'సూర్యోదయం' టెలీఫిలిం నిర్మాణం గురువారం ప్రారంభమైంది. విశ్వసంకీర్తన ఆచార్య తుర్లపాటి, శంభయాచారి, జి.వెంకటేశ్వరరావు తొలి ముహూర్తపు షాటును క్లాప్‌కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత జీఎస్ వాసుదేవరావు మాట్లాడుతూ జడ్పీ డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా ఉంటూనే తన విద్యార్థులతో అనేక సామాజిక ప్రయోజిత కార్యక్రమాలు ధైర్యంగా పాటలు పాడటం, నటించడం నేర్పించానన్నారు. కార్యక్రమంలో నటీనటుల పాల్గొన్నారు.

రాజధాని రైతుల త్యాగం మరువలేనిది

● విజయనగరం ఎంపీ అప్పల్నాయుడు



రాజధాని రైతులు, మహిళలతో మాట్లాడుతున్న అప్పల్నాయుడు

తుళ్లూరు, జూన్ 6: రాజధాని అమరావతికి 33వేల ఎకరాల భూములిచ్చిన రైతుల త్యాగం మరువలేనిదని విజయనగరం టీడీపీ ఎంపీ అప్పల్నాయుడు అన్నారు. ప్రజలు టీడీపీ కూటమికి తిరుగులేని మెజార్టీ ఇచ్చారన్నారు. తనకు 2.50 లక్షల ఓట్ల మెజార్టీ ఇచ్చారని తెలిపారు. గురువారం ఆయన రాజధాని గ్రా మం తుళ్లూరు రైతు ధర్నా శిబిరానికి వచ్చి పరామర్శించారు. ఐదు కోట్ల ఆంధ్రుల రాజధాని అమరావతి అని స్పష్టం చేశారు. న్యాయం అడిగితే జగన్‌రెడ్డి ఉక్కుపాదంతో రైతుల పోరాటం అణచివేయాలని చూశారన్నారు. అమరావతి అభివృద్ధి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పరుగులు పెడతుందన్నారు.



నరేంద్ర కుమార్‌ను సన్మానిస్తున్న బ్రాహ్మణ చైతన్య వేదిక నిర్వాహకులు

నరేంద్ర కుమార్‌కు బ్రాహ్మణ చైతన్యవేదిక సత్కారం

పొన్నూరు టౌన్, జూన్ 6: బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ గురువారం పొన్నూరు ఎమ్మెల్యేగా గెలిచిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. చింతలపూడిలోని నరేంద్ర కుమార్ స్వగృహంలో బ్రహ్మణ సంఘాల నాయకులు నరేంద్ర కుమార్ కలిసి సత్కరించటం తోపాటు వేద పండితుల ఆశీర్వచనాలు అందచేశారు. కార్యక్రమంలో భావదేవ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు రొంపిచర్ల రాజకృష్ణమాచార్యులు, అద్దెపల్లి కృష్ణమోహన్, పొన్నూరు కిషోర్ శర్మ, మహేష్ శర్మ తదితరులు ఉన్నారు.



పఠాన్ బాబు ఖాన్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న నరేంద్ర కుమార్

పఠాన్ బాబుఖాన్‌కు ధూళిపాళ్ల నివాళి

పొన్నూరు టౌన్, జూన్ 6: పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి అనుచరుడు పఠాన్ హబీబుల్లా ఖాన్ (బాబుఖాన్) గురువారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ బాబుఖాన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాబు ఖాన్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని మననం చేసుకున్నారు. బాబు ఖాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ బాబుఖాన్ మృతదేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్ర రాజేశ్వరరావుకు నివాళి అర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి

పొన్నూరు టౌన్, జూన్ 6: చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతిని గురువారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. రాజేశ్వరరావు చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు చేసిన భూ పోరాటం, రైతాంగ పోరాటాలు, నిజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలను గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, గుంటూరు ఏడుకొండలు, తాడిశెట్టి పాండురంగారావు, వెంకటేశ్వర్లు, రంగారావు, గౌస్ సుభాని, దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌కు తెనాలి నాయకుల అభినందలు

తెనాలి అర్బన్, జూన్ 6: టీడీపీ ఘన విజయం సందర్భంగా తెనాలి నుంచి మంగళగిరి వెళ్లిన కార్యకర్తలు గురువారం లోకేశ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. వీరితో పాటు 7వ వార్డు పార్టీ ఉపాధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్‌చైర్మన్ ఆలపాటి శివనరసింహారావు లోకేశ్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ కూటమి ఘన విజయం వెనుక కార్యకర్తల కృషి ఎంతగానో ఉందని పార్టీ నాయకులను, కార్యకర్తలను ప్రశంసించారు.